క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం



కొల్లూరు : వ్యాధుల బారిన పడకుండా ఉండటానికి పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఐసీడీఎస్ దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ పి.నగరాజ కుమారి అన్నారు. గురువారం మండలంలోని తోకలవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలు, మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రుతుక్రమం సమయంలో కిశోర బాలికలు, మహిళలు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి వ్యాధుల బారిన పడకుండా తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. అనంతరం ప్రజలలో అవగాహన కోసం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి టి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



కర్లపాలెం: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాల వంటివని కర్లపాలెం శాఖా గ్రంథాలయాధికారి టీవీ.రమణమ్మ అన్నారు. వేసవి శిక్షణ తరగతులలో భాగంగా గురువారం విద్యార్థులు కర్లపాలెం శాఖా గ్రంథాలయంలో జరిగిన పుస్తక పఠనం, చిత్రలేఖనం, ఖోఖో మ్యూజికల్ చైర్స్ పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులలో గ్రంథాలయాలకు వచ్చి తమకు ఇష్టమైన పుస్తకాలు చదవటంతో పాటు ఆటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటున్నారని చెప్పారు. వివిధ పోటీలలోని విజేతలకు వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభలో బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు.

రేపు వేమవరంలో ధ్వజస్తంభ ప్రతిష్ట



వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో కొలువైన రుక్మాభాయి సహిత శ్రీ పాండురంగ స్వామి గర్భాలయంలో శనివారం హనుమజ్జయంతి పురస్కరించుకుని ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు అర్చకులు ధారా నారాయణ మూర్తి గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత శ్రీ అభయాంజనేయ స్వామి వారిని గర్భాలయంలో ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు. స్వామి వారికి నాగవల్లీ దళ పుష్ప సహిత సింధూర సహస్రనామ పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర



ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుమాన్ జన్మదిన వేడుకలలో భాగంగా గురువారం పురవీధులలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయునికి దేవాలయ ప్రధాన అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో మాచర్ల యజ్ఞ నారాయణ దంపతులు పాల్గొన్నారు. కొతరపు శివశంకర రావు సిద్ధాంతి శిష్య బృందం ఆధ్వర్యంలో భజన సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, నిర్వాహకులు జి.జగన్, ఎం. రామచంద్రరరావు, కె.సుబ్రహ్మణ్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌కు ఉచిత అవగాహన తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: నీట్–2025కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఐదు రోజుల పాటు ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు మెటా మైండ్ అకాడమీ చైర్మన్ ఏ.మనోజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ సాధనలో ఎదురయ్యే సవాళ్లు, మొదటి ప్రయత్నంలోనే మెరుగైన ర్యాంకుకు అవలంబించాల్సిన పద్ధతులపై సీనియర్ సబ్జెక్టు నిపుణులు, మెడికోలతో విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 90908 98928, 90908 98902 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భానుడి ప్రతాపం.. బెంబేలెత్తుతున్న జనం

- రేపల్లెలో 42 డిగ్రీలకు దాటిన ఉష్ణోగ్రతలు
- భరించలేని ఉక్కపోతతో ఇక్కట్లు
- అల్లాడిపోతున్న చిన్నారులు, వృద్ధులు
- ఉదయం నుంచే నిర్మానుష్యంగా రహదారులు



చెరుకుపల్లి రహదారిలో ఉదయం 10 గంటల ప్రాంతంలో..



రేపల్లెలో నిర్మానుష్యంగా మారిన ప్రకాశం స్కూల్ రహదారి



రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో జనసంచారం లేని రహదారి

రేపల్లె రూరల్: భానుడి భగభగలతో రేపల్లె తీర ప్రాంతం తల్లడిల్లిపోతోంది. రోహిణి కార్తె ప్రారంభం నాటి నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా పగటి ఉష్ణోగ్రతలు అధికం అవ్వటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉదయం 7 గంటల నుంచే ప్రచండ భానుడు తన ఉగ్రరూపాన్ని చూపుతూ విరుచుకు పడుతున్నట్లుగా ఎండ వేడిమి అధికంగా ఉంటోంది. రేపల్లెకు సమీపంలో సముద్రం ఉండటంతో ఉక్కపోత వాతావరణం నెలకొంది. అటు గాలులు లేక, ఇటు ఎండ వేడిమితో, మరోవైపు ఉక్కపోతతో ప్రజ లు ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు పడు తున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. పనులపై బయటకు వచ్చే ప్రజలు త్వరిత గతినే తమ పనులను ముగించుకుని ఉదయం 9 గంటలకు ఇంటికి చేరిపోతున్నారు. సాయంత్రం 6 గంటల తరువాత ఎక్కువ మంది బయటకు వస్తుండటంతో పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. దీంతో జన సంచారంతో రద్దీగా ఉండే రహదారులు వెలవెల బోతున్నాయి. రేపల్లె పట్టణంలో గత నాలుగు రోజుల నుంచి 38 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవ్వగా గురువారం అత్యధికంగా 42 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రత నమోదవ్వటంతో పా టు వేడిగాలలు అధికంగా వీచాయి. దీంతో గృహాలలోని నాపరాతి నేల సైతం వేడిగా మారింది.

శీతల పానీయాల బాట పట్టిన ప్రజలు

వేసవి తాపం అధికంగా ఉంటుండటంతో ప్రజలు అధికంగా శీతల పానీయాలు, చల్లని పళ్ల రసాలు తాగేందుకు ఇష్ట పడుతున్నారు. దీంతో పాటుగా చలువ చేసే తాటి ముంజలు, కొబ్బరినీళ్లు, పుచ్చకాయలు తినేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ద్రవ పదార్థాలతో ఉపశమనం



ప్రస్తుతం వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ప్రజలు ఎండలలోకి వెళ్లకుండా నీడ పట్టునే ఉండే విధంగా తమ విధి విధానాలను రూపొందించుకోవాలి. పండ్లతో పాటు పండ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలి. సమయానికి ఆహారం తీసుకోవాలి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలి. ప్రతి ఒక్కరూ బిగుతు దుస్తులు కాకుండా ఒదులుగా ఉండే దుస్తులను మాత్రమే ధరించాలి. నల్లటి రంగు దుస్తులకు వేసవిలో దూరంగా ఉండాలి. అప్పుడే పుట్టిన చంటి బిడ్డలను అరటి ఆకులో పడుకోబెట్టాలి.

– వసంతం వీర రాఘవయ్య, పిల్లల వైద్యుడు, రేపల్లె.

ఆదర్శనీయుడు శ్రీ ఆంజనేయుడు



మాట్లాడుతున్న అగ్నిహోత్రం శేషాచార్యులు

ఐలవరం(భట్టిప్రోలు): శ్రీ ఆంజనేయుని అమృత వాణి వినడం ద్వారా జన్మ జన్మల పాపం పోయి నిత్య సంతోషాలతో జీవిస్తారని ఆర్షా విజ్ఞాన నిధి అగ్నిహోత్రం శేషాచార్యులు అన్నారు. హనుమజ్జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం ఐలవరంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలలో గురువారం రాత్రి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హనుమంతుని సేవా ధృక్పథం, శ్రీరామునిపై గల అచంచల భక్తి విశ్వాసాలు, త్యాగ నిరతి మనందరికి ఆదర్శం కావాలన్నారు. కోరిన కోర్కెలు తీర్చే అభయాంజనేయునిగా, కష్ట సమయాలలో ఆపద్బాంధవుడిగా శ్రీఆంజనేయుడు నిలుస్తాడని భక్తుల ప్రగాఢ నమ్మకమని అన్నారు. శ్రీ రామాయణానికి అంతటి పూర్ణత్వాన్ని తీసుకు వచ్చిన మహనీయుడు ఆంజనీయుడని పేర్కొన్నారు. భయంకర రోగాలను సైతం పోగొట్టే శ్రీ ఆంజనేయ స్తోకం మహిమాన్వితమని అన్నారు. అనంతరం శేషాచార్యులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, దేవాలయ ప్రధాన అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి, నిర్వాహకులు పడమట వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె రూరల్: కార్మిక సమస్యల సాధనకై సీఐటీయూ నిరంతర పోరాటాలు చేస్తూనే ఉంటుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సీఐటీయూ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్న సీఐటీయూ కార్యక్రమాలలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ధర్మరాజు సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కె.ఆశీర్వాదం, వెంకటేశ్వరరావు, కె.రమేష్, వై.కిషోర్, సీహెచ్.అగస్టిన్, కేవీ.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

లింగోద్భవ స్వామి ఆలయంలో భాగవత ప్రవచనం



ప్రవచనం చేస్తున్న బాల గంగాధర శర్మ

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ లింగోద్భవ స్వామి దేవాలయ ఆవరణలో శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ఈనెల 26 నుంచి జూన్ 3 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. శ్రీ మగద్భాగవత కార్యక్రమం ప్రతి రోజూ ఉదయం 4 గంటలు, సాయంత్రం 4 గంటల పాటు వెరసి 8 గంటల పాటు కొనసాగుతుందని తెలిపారు. బ్రహ్మశ్రీ సోమాశి బాల గంగాధర శర్మ గారిచే భాగవత ప్రవచనం నిర్వహించ బడుతుందని తెలిపారు. జూన్ 3న సోమవారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ కృష్ణస్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు.

హనుమాన్ సన్నిధిలో స్తోత్ర పారాయణలు



జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేం చేసి యున్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా గురువారం భజన సంఘాల వారు స్తోత్ర పారాయణ నిర్వహించారు. పరాంకుశం ఆనందబాబు దంపతులు ఉదయం స్వామికి పంచామృత అభిషేకం జరిపించి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం అష్టోత్తర సహస్రనామ పూజలు, పల్లకీ ఉత్సవం జరిపించారు. భజన సంఘాల వారు లలితా, విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణతో పాటు హనుమాన్ చాలీసా పారాయణ జరిపి భజన కీర్తనలు ఆలపించారు.

నాడు–నేడు పనుల పురోగతిపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ అసిస్టెంట్ ఇంజనీర్ పవన్

అమర్తలూరు(వేమూరు): పాఠశాలల్లో నాడు–నేడు పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సర్వ శిక్ష అభియాన్ అసిస్టెంట్ ఇంజనీరు పవన్ సూచించారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో గురువారం సమీక్ష నిర్వహించారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని దీనిని దృష్టిలో ఉంచుకొని పెండింగ్ పనుల పూర్తిపై దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలకు నిధులు చాలని పక్షంలో జిల్లా విద్యాశాఖాధికారికి దరఖాస్తు చేయాలని కోరారు. ప్రస్తుతం అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నిలిపి వేయాలని ఆదేశించారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెరిగిన దేవదాయ శాఖ భూముల కౌలు ఆదాయం

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానం, శ్రీలింగోద్భవ స్వామివారి దేవస్థానం, శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానముల మాగాణి భూముల కౌలు హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ గతంలో బహిరంగ వేలం ద్వారా రూ.8,50,500లు ఆదాయం లభించగా ఈ ఏడాది రూ.10,47,400లు ఆదాయం లభించినట్లు తెలిపారు. గతం కంటే ఈ ఏడాది రూ.1.97 లక్షల ఆదాయం పెరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామలాదేవి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలకు స్పందన



కంటి వైద్య శిబిరంలో నిర్వాహకులు

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం శివారు మండేవారిపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కుంతం ప్రసన్నరాజు మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ కుంతం అనూష ఆధ్వర్యంలో రేపల్లె ఫోకస్ కంటి వైద్యశాల వారి సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో మొత్తం 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 20 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్స నిర్వహించాలని నిర్ధారించిన పిదప రేపల్లె వైద్యశాలకు రిఫర్ చేశారు. 20 మందికి కళ్ల జోళ్లు అవసరమైనట్లు, 25 మందికి ఉచితంగా మందులు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, పార్టీ నాయకులు సీతయ్య తదితరులు ఉన్నారు.

రగ్బీ క్రీడాకారులకు యూనిఫాం, కిట్లు పంపిణీ

కర్లపాలెం: రాష్ట్ర స్థాయిలో రగ్బీ పోటీలలో విజయం సాధించి బాపట్ల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వేగేశన ఫౌండేషన్ అధ్యక్షుడు, బాపట్ల అసెంబ్లీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ రాజు తెలిపారు. బాపట్ల జిల్లా జూనియర్ బాలికల రగ్బీ జట్టుకు గురువారం టీడీపీ కార్యాలయంలో వేగేశన నరేంద్ర వర్మ క్రీడా దుస్తులతో పాటు రగ్బీ కిట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడలలో సైతం బాలికలు రాణిస్తున్నారని చెప్పారు. బాపట్ల జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి పిట్టు సుబ్బారెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జూన్ నెల 1 వరకు రాష్ట్ర స్థాయిలో జరిగే బాలికల రగ్బీ పోటీలలో బాపట్ల జిల్లా జట్టు పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటస్వామి, నాగలక్ష్మి, రగ్బీ క్రీడాకారులు ఉన్నారు.

చలపతి ఫార్మసీలో రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్



టోర్నమెంట్ బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న డాక్టర్ రామారావు, అసోసియేషన్ సభ్యులు

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్(ఏపీసీఏ), శ్రీ ఆనంద్ చెస్ వింగ్ (ఎస్ఏసీడబ్ల్యూ) సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి చెస్ ఓపెన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టోర్నమెంట్‌ను జూన్ 2న లాం నందున్న తమ కళాశాల ఆవరణలో నిర్వహించటం సంతోషకరమన్నారు. మొత్తం 8 రౌండ్స్‌గా ఈ టోర్నమెంట్ నిర్వహించటం జరుగుతుందన్నారు. విజేతలకు రూ.1.10 లక్షల నగదు బహుమతులను అదే రోజున అందజేస్తారన్నారు. ఈ టోర్నమెంట్‌ను 7, 9, 11, 13, 15 ఏళ్ల వయస్సు గల బాల బాలికలకు నిర్వహిస్తారన్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేయటం జరుగుతుందన్నారు. జనరల్ కేటగిరిలో మొదటి 20 మంది విజేతలకు నగదు బహుమతులు అందజేయటం జరుగుతుందన్నారు. బెస్ట్ వెటరన్, బెస్ట్ ఉమెన్, బెస్ట్ గుంటూరు, బెస్ట్ పీహెచ్ ప్లేయర్లకు బహుమతులు అందజేయటం జరుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు రూ.1000లు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరా లకు క్రీడాకారులు ఎం. గోపినాథ్‌ను 9703049378 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కళాశాల అధ్యాపకు లు, పీఈటీలు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో కళ్లం విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నైపుణ్యతతో కూడిన విద్యను అందించటంతో పాటు ఉపాధి లక్ష్యంగా తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎమ్ ఉమాశంకర్‌రెడ్డి అన్నారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల జాబ్ అచీవర్స్‌డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. కళాశాలలో 2023–2024 విద్యా సంవత్సరంలో డిప్లొమా డిగ్రీ పూర్తి చేసుకున్న మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 48 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. సూర్యటెక్ సొల్యూషన్స్, లాగిస్కిం సొల్యూషన్స్ వంటి సంస్థల్లో తమ విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించటం సంతోషకరమన్నారు. ఉద్యోగాలను సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

రోగుల పాలిట ఆశా కిరణాలు

- కరోనా కట్టడిలో ఆశాల సేవలు మరువలేనివి
- ఇంటింటా సర్వేలతో అప్రమత్తం
- నిర్దేశిత ప్రాంతాల్లో విస్తృత సేవలు
- సీఎం వైఎస్ జగన్ పాలనలో ఆశాల జీవితాల్లో వెలుగులు



బాలింతకు సూచనలు చేస్తున్న వైద్య సిబ్బందితో ఆశా కార్యకర్తలు (ఫైల్)

భట్టిప్రోలు: కంటికి కనిపించని కరోనా వైరస్‌పై ప్రపంచం మొత్తం యుద్ధం చేస్తున్న తరుణంలో ఆపత్కాలంలో 'ఆశా' కిరణాలు అందించిన సేవలు అమూల్యం. ఈ వైరస్‌ని కట్టడి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో శ్రమించాయి. సవాలుతో కూడుకున్న పనిని సామాజిక స్వచ్ఛంద ఆరోగ్య కార్యకర్తలు (ఆశాలు) కీలక పాత్ర పోషించి విశిష్ట సేవలు అందించారు. ఆ సమయంలో వీరు తమ ప్రాణాలను తెగించి అహర్నిశలు సేవలు అందించారు. అనుమానితులను గుర్తించడంతో పాటు వారిని పర్యవేక్షిస్తూ ప్రసంశలు అందుకున్నారు.


సవాలుతో కూడుకున్న విధులు

వేమూరు నియోజక వర్గం పరిధిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు 5 మండలాల్లోని 9 పీహెచ్‌సీల పరిధిలో 400 మందికి పైగా ఆశా కార్యకర్తలు తమకు నిర్దేశించిన ప్రాంతాల్లో విస్తృత సేవలు అందిస్తున్నారు. కరోనా లక్షణాలు ఉన్న వ్యక్తి వందల మీటర్ల దూరంలో ఉన్నప్పటికీ వారికి సమీపంలో ఉన్న వ్యక్తులు ఈ వ్యాధికి గురి కావడం సర్వ సాధారణం. ఐతే సదరు వ్యక్తికి వైరస్ లక్షణాలు ఉన్నాయని పాజిటివ్ వచ్చిందని తెలిసినప్పటికీ క్వారంటైన్ కేంద్రాలతో పాటు ఆయా వ్యాధి పీడితుల గృహాలను సందర్శించి వారికి కావాల్సిన మందులు ఇస్తూ వారు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానం చెబుతూ అహోరాత్రులు ఆశా కార్యకర్తలు సవాళ్లతో కూడుకున్న విధులు నిర్వహించారు. వీటితో పాటు ఇంటింటి సర్వేలు నిర్వహించి కొత్త రోగులను గుర్తించి కుటుంబాలకు దూరంగా పెట్టి కరోనా నివారణలో తమ వంతు పాత్రను సమర్థంగా పోషించారు. అంతే కాక తమకు మించిన భారమైనా పనులను నిర్వహిస్తూన్నరు. నాడు కులాసా డాక్టర్లను గుర్తు చేసే విధంగా అంతకు మించి సేవలు అందించే ప్రయత్నంలో భాగంగా ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ ప్రతి ఒక్కరినీ బాగున్నారా అంటూ కుశల ప్రశ్నలు వేయడం వారి విధి నిర్వహణలో భాగమైంది.

ప్రభుత్వ ప్రోత్సాహం

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆశా కార్యకర్తలకు మంచి గుర్తింపు లభించింది. ఆ తరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం వీరి సేవలను ఏ మాత్రం గుర్తించ లేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆశా కార్యకర్తల కష్టానికి తగిన గుర్తింపును ఇచ్చింది. దీంతో వీరు మరింత బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారు. వారి జీతాన్ని రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పెంచి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. దీంతో మరింత బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నట్లుగా ఆశా కార్యకర్తలు తెలుపుతున్నారు.


మా జీవితాల్లో వెలుగులు నింపారు..



గత ప్రభుత్వ హయాంలో రూ.3 వేలు జీతం ఇచ్చేవారు. కానీ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ సార్ రూ.10 వేలు వేతనం ఇచ్చి మా జీవితాల్లో వెలుగులు నింపారు. ప్రభుత్వ ఆదేశాను సారం కరోనా కట్టడిలో వైద్య సిబ్బందితో పాటు మేమూ భాగస్వాములం అవుతున్నాం.

–ఎస్.వెంకటరమణ, ఆశా కార్యకర్త, భట్టిప్రోలు–1.

నమ్మకాన్ని ఒమ్ము చేయం..



ప్రతి ఇంటా సర్వేలు, కొత్త వ్యక్తులను గుర్తించడం, ప్రతి ఒక్కరి గురించి వాకబు చేయడం, వ్యాక్సినేషన్ చేయించుకోమని చెప్పటం, ఇలా మా బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నాం. చిత్త శుద్ధితో పని చేసి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తున్నాం. నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పని చేస్తున్నాం.

–చేగూడి ద్వారకా కుమారి, ఆశా కార్యకర్త, వెల్లటూరు పీహెచ్‌సీ.

పుట్ట హుండీ ఆదాయం రూ.73 వేలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

పొన్నూరు: మండలంలోని కట్టెంపూడి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ నాగేంద్ర స్వామి దేవస్థానం(పుట్ట)కు సంబంధించిన రెండు హుండీలను గురువారం లెక్కించగా రూ.73 వేలు ఆదాయం సమకూరినట్లు ఆలయ మేనేజరు ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ఎండోమెంట్ బాపట్ల ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో 85 రోజులకు సంబంధించి కానుకల రూపంలో వచ్చిన నగదును లెక్కించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్ పర్సన్ వి.శివనాగేంద్రమ్మ, సభ్యులు పాల్గొన్నారు.